







నేటి నుంచి సిపిఎం జిల్లా మహాసభలు

పేదల పెన్నిధి.. ఉద్యమ వారధి..!

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఉద్యమాల వారధి.. ప్రజా సమస్యలపై నిరతరం పోరాటాలు చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల కోసం అలుపెరగని ఉద్యమాలు నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) చిత్తూరు జిల్లా మహాసభలు జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు జరగనున్నాయి. స్థానిక శాంతా రఘురామ్ కళ్యాణమండపంలో ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నారు. మొదటి రోజైన శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు చిత్తూరు రైల్వే స్టేషన్ నుండీ ఎంఎస్ఆర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ జరగనుంది. డిఈఒ కార్యాలయం ఎదురుగా ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నారు. జిల్లా మహాసభలకు సిపిఎం రాష్ట్ర నాయకులు రమాదేవి, దడాల సుబ్బారావు ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నారు.

జిల్లాల విభజన తరువాత 32 మండలాలతో చిత్తూరు జిల్లా ఏర్పడింది. జిల్లా జనాభా 20లక్షలు. ఉమ్మడి జిల్లాలో తిరుపతిలోనే యూనివర్శిటీలు ఏర్పాటు కావడంతో చిత్తూరు జిల్లా కేంద్రమైనప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదు. పాలకుల నిర్లక్ష్యం, ఏకపక్ష ధోరణితో జిల్లా కేంద్రంలోని సహకార విజయా డెయిరీ, సహకార షుగర్ ఫ్యాక్టరీ, న్యూట్రిన్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. చిత్తూరు పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత ఉపాధి కోసం చెన్నై, బెంగుళూరు వంటి మహా నగరాలకు వలస బాట పట్టింది. చిత్తూరు జిల్లా సమాగ్రాభివృద్ధి కోసం సిపిఎం సుదీర్ఘకాలం నుండీ పోరాటాలు సాగిస్తోంది. ఉమ్మడి జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నగరి పవర్‌లూమ్ కార్మికులు 2500 మంది జాతీయ రహదారిని దిగ్బంధం చేశారు. జీతాల పెంపు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు 42 రోజులు పాటు సమ్మె చేశారు. దేశ రక్షణ భేరి పేరిట ప్రజా సమస్యలపై బస్సు జాతా ద్వారా జిల్లాలో ప్రచారం నిర్వహించి, బహిరంగ సభ నిర్వహించింది.

సిపిఎం ప్రజా పోరాటాలు

ఇంటి పని చేసుకొని జీవిస్తున్న ఓ మహిళపై జైల్ సూపరిండెంట్ చోరీ కేసు పెట్టడంతో పోలీసులు జైభీం తరహాలో పోలీస్‌స్టేషన్‌లోనే బాధితురాలు ఉమామహేశ్వరిని చిత్ర హింసలకు గురి చేయడంతె చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద సిపిఎం ధర్నా నిర్వహించింది. బాధితురాలి పక్షాన అఖిల పక్ష పార్టీల సమావేశం ఏర్పాటు చేసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించింది. ఈ ధర్నాలో సిపిఎం మాజి ఎంపి మధు పాల్గొన్నారు. నీవా నది బాధితుల సమస్యలపై పోరాడుతూ బాధితులకు అండగా నిలుస్తోంది. ఉద్దాద్ తుపాను సందర్భంగా సిపిఎం రాష్ట్ర నాయకత్వం వరద బాధితులను పరామర్శించి నీవానది కి ఇరువైపులా గోడ నిర్మించాలని డిమాండ్‌తో ప్రస్తుత ప్రభుత్వం రూ. 175 కోట్లుతో ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రతిపాదన సిద్ధం చేసింది. యాదమరి మండలం భూమి రెడ్డిపల్లి నందు బీసి కాలనీ దారిని అగ్రకులస్తులు ఆక్రమించుకొని దారికి కంచెవేస్తే సిపిఎం పోరాటంతో పేదలకు న్యాయం జరిగింది. బంగారుపాళ్యం మొగిలి ఊరగుట్టు యానాదుల సమస్యలపై పోరాటం సాగించి పోరాడి విజయం సాధించింది. 58 ఎకరాలు సిపిఎం పోరాటంతో సర్వే చేయించి యానాదులకు పాఠశాల, ఇండ్ల స్థలాలు ఇప్పించేలా పోరాటం సాగుతోంది. బోయకొండ బాధితుల పోరాటం సాగుతోంది. ఇలా జిల్లాలోని పేద, బడుగు, బలహీన వర్గాల పక్షనా సిపిఎం పోరాటాలు నడుపుతోంది.

అంగన్వాడీల చారిత్రక పోరాటం

అంగన్వాడీల దీర్ఘకాలిక సమస్యలపై సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఉమ్మడిగా చిత్తూరు జిల్లాలోని 12 ఐసిడిఎస్ ప్రాజెక్టులో చారిత్రక పోరాటాన్ని గత ఏడాది డిసెంబర్ 12వ తేది నుండీ జిల్లాలో 42 రోజుల పాటు చారిత్రిక సమ్మె సాగింది. నాటి అధికార పార్టీ బెదిరింపులు, సచివాలయ ఉద్యోగులను రంగంలోకి దింపి అంగన్వాడీలపై ఒత్తిడి తీసుకొచ్చారు.ఐక్యంగా అంగన్వాడీలు సమ్మెను కొనసాగించి సత్తాచాటారు. రాజకీయ వేధింపులపై సంఘమిత్రలు సుదీర్ఘ పోరాటం చేశారు. శాసన సభ్యుల నివాసాల ముట్టడి వంటి కార్యక్రమాలతో సంఘమిత్రల సమస్యలు కొంత మేరకు పరిష్కరించబడ్డాయి.

ప్రజా సమస్యలే అజెండాగా



గత మూడు సంవత్సరాల కాలంలో జిల్లాలో ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాటాలు సాగిస్తున్నాం. ఈ మేరకు సిపిఎం పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగింది. అధికారుల్లో కదలిక వచ్చింది. ఈ ఒరవడి కొనసాగిస్తున్నాం. జిల్లా కేంద్రంతో పాటు ఏడు నియోజకవర్గాలో యువతకు ఉపాధి కల్పించేలా పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పాటును ఇస్తోంది. జిల్లాలో ప్రతి సంవత్సరం మామిడి రైతులు గిట్టుబాటు ధర లేక సిండికేట్‌తో నష్టపోతున్నారు. వీరిని ప్రభుత్వం ఆదుకోవాలి. చిత్తూరు తచూరు ఎన్‌హెచ్ హైవే బాధితులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలి. జిల్లా కేంద్రంలో యూనివర్శటి నెలకొల్పాలి. విభజన చట్టంలో భాగంగా జిల్లాలోని పలమనేరు ప్రాంతంలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు హామీని నిలబెట్టుకోవాలి. నగరి పవర్‌లూమ్ కార్మికుల కు తమిళనాడు తరహాలో 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలి. జిల్లాలోని ప్రజానీకం ఎదుర్కొటున్న అనేక సమస్యలపై రానున్న రోజుల్లో సిపిఎం పోరాటాలు నిర్వహించనుంది. శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 14వ జిల్లా మహాసభల్లో ప్రజల సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేయనున్నాం.

- వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి

'రెవెన్యూ' నిర్లక్ష్యానికి 'సాక్షిగా'..

దళిత కుటుంబంపై పెత్తందారుల దాడి



అగ్రకులాల చేతుల్లో దళితులపై దాడి చేస్తున్న దృశ్యం




రౌడీలతో మహిళలపై దాడి

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూమిని పెత్తం దారులు ఆక్రమించుకుకోవడమే గాకుండా, బయట ప్రాంతాల నుంచి రౌడీలను పిలిపించి దళిత కుటుంబంపై దాడికి పాల్పడ్డ ఘటన బైరెడ్డిపల్లి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అనేకమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా, తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించినా సమస్య పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేసినందువల్లే ఈ పరిస్థితి దాపురించిందని దళితులు వాపోయారు. బాధితుల వివరాల మేరకు.. బైరెడ్డిపల్లి మండలం పెద్ద చెల్లారగుంట రెవెన్యూ పరిధిలోని 174/2లోని 1.24 సెంట్ల భూమిని తాతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దళిత కుటుంబ సభ్యులు మూడు తరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన అశోక్‌కుమార్ రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కయ్యి గౌరమ్మ పేరుపై పట్టా పాస్‌బుక్ చేయించుకున్నారు. అయితే మూడు తరాలుగా తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూమిని గౌరమ్మ పేరుతో ఎలా పట్టా పాస్ బుక్ ఇస్తారంటూ దళితులు వెంకట లక్ష్మమ్మ, కృష్ణప్ప, నారాయణప్ప, చంద్ర, కనకమ్మలు వాపోయారు. నిరసిస్తూ అప్పట్లోనే తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అర్జీ సమర్పించారు. మండలంలోని దళితసంఘాలు సైతం దళిత కుటుంబానికి అండగా నిలిచాయి. తహశీల్దార్ మాధవరాజుకు వినతిపత్రం సమర్పించారు. అయితే అప్పటినుంచి తహశీల్దార్ మాధవరాజు ఈరోజు, రేపు సమస్యను పరిష్కరిస్తానంటూ కాలం గడుపుతూనే వచ్చారు. నాలుగు రోజుల క్రితం చంద్ర భూ సమస్య పరిష్కరించాలని మరోసారి గుర్తు చేశారు. దీంతో నవంబర్ 7న క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అయితే తహశీల్దార్ ప్రకటనలో అశోక్‌కుమార్ వేరే గ్రామానికి చెందిన కొంతమంది రౌడీమూకలను వెంటబెట్టుకుని వచ్చి జేసీబీ సాయంతో దళితులు వేసిన పంటను నాశనం చేశారు. విషయం తెలుసుకున్న దళితులు అక్కడకు చేరుకుని జేసీబీని అడ్డుకునే ప్రయత్నం చేయగా అశోక్‌కుమార్ రౌడీల సాయంతో దళితులపై దాడికి పాల్పడి హత్యాయత్నం చేశాడు. ఈ విషయమై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెత్తందారుల చేతిలో గాయపడిన గౌరమ్మ, కృష్ణప్పలు పలమనేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

పులిచెర్లలో గజరాజుల స్వైర విహారం

- భయాందోళనలో ప్రజలు
- కంటిమీద కునుకులేకుండా చేస్తున్న 17 ఏనుగుల మంద
- తీవ్రంగా శ్రమించి అటవీ ప్రాంతంలోకి తరిమివేత



మామిడితోటలో ఏనుగుల గుంపు

ప్రజాశక్తి-సోమల: పులిచెర్ల మండలంలో 17ఏనుగుల గుంపు స్వైర విహారం చేస్తున్నాయి. పంటపొలాల్లో, ఊళ్లలో సంచరిస్తున్నాయి. దీంతో అక్కడి ప్రజలు భయాందోళనలో గడుపుతున్నారు. రాత్రిల్లో పంటపొలాల్లో ఒంటరిగా బయట ఊళ్ల నుంచి రావాలన్నా, వెళ్లాలన్నా బెంబేలెత్తిపోతున్నారు. శుక్రవారం ఉదయం ఏనుగుల గుంపు పులిచెర్ల మండలం కొంగరవారిపల్లి, తుడుంవారిపల్లి, గుట్టకింద హరిజనవాడ పరిసరాల్లోని వ్యవసాయ పొలాల్లో సంచరించాయి. గురువారం రాత్రి నుంచి ఏనుగుల గుంపు సంచరిస్తుండడంతో అప్రమత్తమైన అటవీ అధికారులు వాటిని అడవిలోకి మళ్లించేందుకు రాత్రంతా శ్రమించారు. శుక్రవారం ఉదయం స్థానికులు, పోలీసులు సహాయంతో రిజర్వ్ ఫారెస్ట్‌లోకి తరిమివేశారు. దీంతో మండల ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. రాత్రిల్లో, పగటిపూట రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు సూచిస్తున్నారు. నిత్యం పంటపొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల బారి నుంచి తమను, పంట పొలాలను కాపాడేందుకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

హోంగార్డు పిల్లలకు మెరిట్ స్కాలర్షిప్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: 18మంది హోంగార్డు పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కులను శుక్రవారం ఎస్పి మణికంఠ చందోలు చేతుల మీదుగా అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో తమ చదువులో ప్రతిభ కనబరిచిన 18మంది హోంగార్డ్ పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల విద్యకు ప్రోత్సాహం కల్పించడం, వారి భవిష్యత్తు పురోగతికి సహకరించడం ప్రధాన లక్ష్యం అని హోంగార్డులు తమ కుటుంబాన్ని, పిల్లలను ఉత్తమమైన విధంగా నడిపించడానికి ఎంతో కష్టపడుతున్నారన్నారు. అలాంటి పిల్లల విద్యాభ్యాసానికి పునాది వేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ స్కాలర్‌షిప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, విజ్ఞానం, ప్రతిభను పెంపొందించుకోవాలని ఎస్పి ఆకాంక్షించారు.



స్కాలర్షిప్ చెక్‌ను అందజేస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

ప్రతి అర్జీని ఆడిట్ చేస్తాం..

- అర్జీల రీ ఓపెన్‌కు తావు లేకుండా సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలి
- అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం




సమస్యలు వింటున్న కలెక్టర్, జేసీ

ప్రజాశక్తి-కుప్పం టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని ఆడిట్ చేస్తామని, నిర్దేశిత కాలం లోపు సమస్యలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కుప్పం నియోజకవర్గానికి సంబంధించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కుప్పం ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమ అనంతరం జెసీ విద్యాధరి, కడా పీడీ వికాస్ మర్మత్‌లతో కలసి కుప్పం నియోజకవర్గ అధికారులతో పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీల పరిష్కారంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కుప్పంలో గతంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలలో ఇంకా కొన్ని పరిష్కారం కాలేదని, అర్జీల పరిష్కారానికి అధికారులకు సమయం ఇవ్వడం జరుగుతుందని, నిర్దేశిత కాల సమయంలోపు పరిష్కరించాలని అన్నారు. సమస్యల పరిష్కారంలో భాగంగా ఎంక్వయిరీ, సర్వే, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని, అవసరం అయితే ఉన్నతాధికారికి బదలాయించడం చేయాలన్నారు. పిజిఆర్ఎస్‌లో అందిన ప్రతి అర్జీని ఆడిట్ చేస్తామన్నారు. అర్జీదారులలో కొంత మందికి నేరుగా ఫోన్ చేసి సమస్యల పరిష్కారంపై ప్రజా స్పందన తెలుసుకుంటామన్నారు. గ్రామ సచివాలయాలలో సిబ్బంది హాజరును ఎంపీడీవోలు పర్యవేక్షించాలన్నారు. సచివాలయాల కు వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యలతో వచ్చే ప్రతి అర్జీదారుని సమస్యను సావధానంగా విని పరిష్కరించడానికి వీలుపడే వాటికి సత్వర పరిష్కారం చూపాలని, పరిష్కరించబడని సమస్యలకు సంబంధించి వివరాలను అర్జీదారునికి పూర్తిగా తెలియజేయాలన్నారు. జిల్లా స్థాయిలో పరిష్కరించే అంశాలను జిల్లా సచివాలయాలకు పంపినట్లైతే పరిశీలించడం జరుగుతుందన్నారు. అర్జీల రీ ఓపెన్‌కు తావు లేకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. రీసర్వే, ఫ్రీ హోల్డ్ వెరిఫికేషన్, మ్యూటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో ఆర్టిసి వైస్ చైర్మన్ మునిరత్నం, జెడ్పి సిఈవో రవికుమార్ నాయుడు, హౌసింగ్ పీడీ పద్మనాభం, వివిధ సంబంధిత శాఖల నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు ఆర్‌డీవోగా భవాని బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-పలమనేరు: ంపలమనేరు రెవెన్యూ డివిజనల్ అధికారిగా భవాని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో జిల్లా ఫారెస్టు సెటిల్మెంట్ ఆఫీసర్గా పనిచేసి బదిలీపై పలమనేరుకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది భవానికి ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.



త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు సేవలు

- ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్
- ఏడు బస్సు సర్వీసులు ప్రారంభం



బస్సు సర్వీసులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ చెప్పారు. శుక్రవారం చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో ఏడు ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గడిచిన ఐదు నెలలో చిత్తూరులో 27బస్సులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఆరు నూతన సర్వీసులు, ఒక టౌన్ సర్వీసును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అడిగిన వెంటనే చిత్తూరుకు ఆర్టీసీ బస్సులు కేటాయించిన సీఎంకి, మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే ఒక మంచి ముహూర్తంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. స్థానికులు, విద్యార్థుల కోరిక మేరకు చిత్తూరు నుండి అనుపల్లికి టౌన్ సర్వీసు ప్రారంభించామన్నారు. చిత్తూరు బస్టాండు నుంచి కలెక్టరేట్, ప్రశాంత్ నగర్, మీదుగా అనుపల్లి టౌన్ సర్వీసు బస్సును ఎమ్మెల్యే స్వయంగా గాంధీ సర్కిల్ వరకు నడిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం జగదీష్, ఆర్టీసీ 1, 2 డిపోల మేనేజర్లు కృష్ణమూర్తి, రూపశ్రీ, ఆర్టిసి సిబ్బంది, మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, మాజీ మేయర్ కటారి హేమలత, డెప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, టీడీపీ అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్ర కుమార్, సీనియర్ నాయకులు వసంత్ కుమార్, ఉమ్మడి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

- అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పూతలపట్టు: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూసేకరణ కోసం రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకోబోమని ఎమ్మెల్యే మురళీమోహన్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో పాకాల, పూతలపట్టు మండల రైతులతో రెవిన్యూ అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించి రైతుల అభిప్రాయాన్ని తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారిని మురుగునీటి కాలువల కోసం మరింత విస్తరించాల్సి ఉంది. ఇందుకోసం మరో మారు అధికారులు భూసేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే.. మొదటి విడతలో తీసుకున్న సుమారు 250మంది రైతులను ఇప్పటికీ పరిహారం చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. నిబంధనల ప్రకారం డ్రైనేజీ వ్యవస్థ పూర్తి కాకముందే రహదారిని ప్రారంభించకూడదు. కానీ ఆదాయం కోసం ఇష్టానుసారంగా డ్రైనేజీని అసంపూర్తిగా వదిలేశారని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం సేకరిస్తున్న భూమికి ఎంత పరిహారం చెల్లిస్తున్నారని విషయాలను అడిగి తెలుసుకున్నారు. డిఆర్‌వో పిళ్లై, ఆర్‌డీవో శ్రీనివాసులు, ఎమ్మెల్యే సలహా మేరకు రైతుల ఉద్దేశాన్ని అడిగి తెలుసుకున్నారు. ముందస్తుగా నష్టపరిహారం వివరాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ గురప్ప, సిబ్బంది పాల్గొన్నారు.



వరిలో కాలిబాట.. రైతులకు లాభాల పంట

- వరిసాగులో అధిక ప్రయోజనం
- చీడపీడల నుంచి పంటలకు రక్షణ
- దిగుబడి పెరిగే అవకాశం

ప్రజాశక్తి-విజయపురం(నగరి): వరి పంటలో కుదుళ్లను దగ్గరగా నాటడం వలన పంటకు తెగుళ్లు ఎక్కువగా సోకే అవకాశం ఉంది. తెగుళ్ల నివారణకు వరి నాట్ల సమయంలో కాలిబాటలను వేసుకుంటే ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. వరి నాట్లలో కాలిబాటలను ఏర్పాటు చేసుకోవడం వలన బహుళ ప్రయోజనాలున్నాయని, ముఖ్యంగా పైరు గాలి, సూర్యరశ్మి సక్రమంగా అందడంతో ఏపుగా పెరుగుతుందని నగరి మండల వ్యవసాయాధికారి చెబుతున్నారు. నగరి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సుమారు 2వేల ఎక్టార్లలో వరి సాగు అవుతుంది.

కాలిబాటలతో ప్రయోజనాలు ఇలా..

వరిలో తెగుళ్ల సమర్ధవవతంగా తట్టుకునేందుకు ప్రతి రెండు మీటర్లకు 20సెంటీమీటర్ల దూరంగా కాలిబాటలను వేసుకోవాలి. కాలిబాటలలో మొక్కల సామర్థ్యం పెరుగుతుంది. పంటకు గాలి సూర్యరశ్మి పుష్కలంగా లభిస్తుంది. అగ్గి తెగుళ్ల, సుడిదోమ వ్యాప్తిని అదుపు చేయవచ్చు. ఎరువులను కాలిబాటల ద్వారా చల్లితే పొలమంతా సమానంగా వేసేందుకు అవకాశం ఉంటుంది. సేంద్రియ ఎరువు మొక్కలకు పూర్తిస్థాయిలో అందుతుంది. కిరణ జన్య సంయోగక్రియ అధికంగా జరిగి మొక్కల్లో పత్రహరితం అధికంగా ఉత్పత్తి కావడంతో పంటల దిగుబడులు పెరిగే అవకాశం ఉంది. ఎలుకలను సమర్ధవంతంగా అదుపు చేయవచ్చు. కోత సమయంలో పంట నేలవాలితే నిలబెట్టడానికి అనుకూలంగా ఉంటుంది.

ఇలా చేయకూడదు..

వరి కుదుళ్లను గొచ్చులుగా నాటడం వలన పంటకు గాలి, వెలుతురు సక్రమంగా అందక పైరు పెరుగుదల మందగించడంతో పాటు చీడపీడలు త్వరగా ఆశిస్తాయి. సాధారణంగా ఎక్కువ వరి మొనలను నాటితే ఎక్కువ దిగుబడి వస్తుందని రైతులు భావిస్తుంటారు, అయితే ఇది సరైన పద్ధతి కాదు. వరి మొనలలో సాంద్రతే కీలకం. దగ్గరగా నాటడం వల్ల మొక్కలకు అంతర వాతావరణం అనుకూలించక తెగుళ్ల ఎక్కువగా సోకే అవకాశం ఉంది.

దిగుబడి పెరిగే అవకాశం



వరి పంటలో కాలి బాటలు తీయడం వల్ల దిగుబడి పెరిగే అవకాశం ఎక్కువ. ప్రతి రైతు వరి పంట నాటిన మూడు రోజుల నుంచి కాలిబాటలు తీసుకోవాలి. కాలి బాటలను ఏర్పాటు చేసుకోవడం వలన బహుళ ప్రయోజనాలున్నాయి. ముఖ్యంగా పైరుకు గాలి, సూర్యరశ్మి సక్రమంగా అందడంతో పాటు ఏపుగా పెరుగుతుంది. దీంతో తెగుళ్ళ, చీడపీడలు తగ్గడంతో పాటు దిగుబడులు కూడా పెరిగే అవకాశం ఉంది.

రాఘువేంద్ర యాదవ్, ఏవో, నగరి

'మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి'

ప్రజాశక్తి-కార్వేటినగరం: మాదకద్రవ్యాలపై ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు శుక్రవారం క్రాస్ సచ్ఛందా సేవా సంస్థ ఆధ్వర్యంలో చిత్తూరు నెహ్రూ యువ కేంద్రం సహకారంతో ఆహ్వాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ ప్రదీప్, క్రాస్ సంస్థ డైరెక్టర్ భూపతికి మాట్లాడుతూ విద్యార్థులకు మాదకద్రవ్యాలు తీసుకోవడం వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులు రెడ్డి మాట్లాడుతూ అవార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో కలానాటకం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ యువత చెడు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ రాజకుమార్

వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఇన్‌ఛార్జ్ ధనంజయ రెడ్డి, క్లాస్ సంస్థ సభ్యులు సోమశేఖర్, హరీష్, దొరస్వామి, మునికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండలాధ్యక్షులుగా పార్థసారథి

ప్రజాశక్తి-యాదమరి: మండల యుటిఎఫ్ కార్యవర్గ ఎన్నిక శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో జరిగింది. నూతన కార్యవర్గ ఎన్నికకు చిత్తూరు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు, కార్యదర్శి మణికంఠ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు యుటిఎఫ్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎం శేఖర్, మండల అధ్యక్షులుగా కే పార్థసారథి, ప్రధాన, కార్యదర్శిగా డి సర్దార్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎం సురేష్ కుమార్, మహిళా అసోసియేట్ అధ్యక్షులుగా జహరేనా, కోశాధికారిగా డిజి గిరిబాబు, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ టి సుబ్రమణ్యం, ఆడిట్ కమిటీ సభ్యులు





చిట్టిబాబు, కార్యదర్శులు ఏ మూర్తి, తులసి మునయ్య, జ్యోతి, శారద లతా రాసి, మణి, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పంటపల్లి సురేష్, జిల్లా కౌన్సిలర్స్ రెహనా బేగం, మల్లికార్జున, సురేష్, సుల్తాన్, గౌరవ సలహాదారులు శివాజీ గణేషన్, వైఆర్ కృష్ణయ్య, షణ్ముగం, రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తేజశ్రీ


యోగా పోటీలలో పాల్గొన్న తేజశ్రీ

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న తేజశ్రీ జిల్లాస్థాయి యోగా పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచినట్లు పాఠశాల హెచ్ఎం వెంకటరమణ బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణంలో శుక్రవారం జిల్లా స్థాయి యోగ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలలో తమ విద్యార్థి ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా తేజశ్రీని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

పచ్చదనం పరిశుభ్రత పట్టణ అభివృద్ధికి సోపానం

- ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పచ్చదనం పరిశుభ్రత పట్టణ అభివృద్ధికి సోపానమని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణ పరిధిలో చెట్లు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కడా పిడి వికాస్ మరమత్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు నేతాజీ రోడ్డులోని డివైడర్లలో స్వయంగా చెట్లను నాటారు.


చెట్లు నాటుతున్న ఎమ్మెల్సీ, కడా పీడీ

ప్రజలు సైతం ప్రతి ఒక్కరు చెట్లను నాటి, వాటిని పరిరక్షించాలని పిలుపునిచ్చారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

- పోలీస్ లాంచనాలతో అంత్యక్రియలు

ప్రజాశక్తి-పుంగనూరు: ఉద్యోగరీత్యా తిరుపతిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందడంతో పోలీసు లాంఛనాలతో పుంగనూరు మండలం చిన్న తాండ గ్రామంలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. పుంగనూరు మండలం చిన్న తండా గ్రామానికి చెందిన విజయకుమార్ నాయక్ (47) కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఇతని అంత్యక్రియలు స్వగ్రామమైన చిన్న తాండలు నిర్వహించారు. ఇతని



తల్లి కమలమ్మ, భార్య లలిత, కుమారుడు రోహిత్ నాయక్‌లు ఉన్నారు. 2000 బ్యాచ్ చెందిన విజయ్ కుమార్ నాయక్ ఉద్యోగరీత్యా చిత్తూరు, తంబళ్లపల్లి, పెద్దమండెం, తిరుపతిలో పనిచేశారు.

పలమనేరు బస్టాండ్‌కు మోక్షం

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు ఆర్టీసీ బస్టాండ్‌లో గత రెండు వారాలుగా పడుతున్నటువంటి వర్షాలకు గుంతలు పడి ఎక్కడబడితే అక్కడ నీళ్ల నిలిచిపోయాయి. దుర్గంధ భరితంగా దోమలకు నిలయంగా ఉండేది. బస్టాండ్ లోపల ఆటోలు, కార్లు రాకుండా మధ్యలో అడ్డంగా చెట్ల కొమ్మలు, కొయ్యిలు వేసినందువలన ప్రయాణికులు, టూ వీలర్స్ ఇబ్బంది పడేవారు. సమస్యపై ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన ఆర్టీసీ డిపో మేనేజర్ స్వామి శుక్రవారం బస్టాండ్‌ను సందర్శించారు. అడ్డంగా వేసినటువంటి కొయ్యలు, కొమ్మలను తొలగించారు. బస్టాండ్ ఆవరణలో ఉన్న గుంతలను మిగిలిన మట్టి ప్రదేశాన్ని సిమెంట్ కాంక్రీట్ ఫ్లోరింగ్ వేయడం కోసం



ఆర్టీసీ సివిల్ ఇంజనీర్‌ని తీసుకొని వచ్చి కొలతలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజాశక్తి విలేఖరి, ప్రయాణికులు డిపో మేనేజర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పలమనేరు సివిల్ జడ్జి శ్రీనివాస రావుకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు సీనియర్ సివిల్ కోర్ట్ జడ్జ్ పగడాల శ్రీనివాసరావుకు జిల్లా జడ్జిగా ఉద్యోగోన్నతి పొందారు. ఆ మేరకు శుక్రవారం జిల్లా జడ్జిగా పదోన్నతి రావడంపై



ప్రొసీడింగ్స్ వచ్చాయి. పలమనేరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జిగా గత మూడు సంవత్సరాల క్రితం ఆయన పలమనేరులో బాధ్యతలను చేపట్టారు. అప్పటి నుండి పలు రకాల కేసుల పరిష్కారానికి తన వంతు నిత్యం కృషి చేశారు.

గ్రామీణులకు పశుసంపదపైనే ఆదాయం

- ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: గ్రామీణులకు పశు సంపదపైనే ఆదాయ వనరులు అని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్



అన్నారు. శుక్రవారం మండలంలోని నలగంపల్లి గ్రామంలో పశు గణన కార్యక్రమం పశువర్ధక శాఖ ఏడి ఆసిఫ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ప్రధాన ఆదాయ వనరులుగా ఉన్న పశు సంవర్ధక రంగాన్ని మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో పశు వర్ధక శాఖ జెడి ప్రభాకర్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్లు ఝాన్సీ, మాజీ ఏఎంసీ చైర్మన్ జయచంద్ర నాయుడు, సింగల్ విండో మాజీ చైర్మన్ హేమచంద్ర నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు జయ ప్రకాష్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి జనార్థన్ గౌడ్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ధరణీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

చిత్తూరు అర్బన్: 21వ పశుగణన పోస్టర్‌ను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఆవిష్కరించారు. శుక్రవారం చిత్తూరులో మేయర్ ఎస్ అముద, పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బహువిధ పశు వైద్యశాల డీడీ సుబ్బమ్మ, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ ఏడీ చంద్రశేఖర్, రాజశేఖర్ రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు, పాలసముద్రం మండలాలలో పశుగణన ప్రారంభించినట్లు పశుసంవర్ధక శాఖ ఏడి మురళీమోహన్ తెలిపారు. మండలంలోని కె.నాశంపల్లిలో సర్పంచ్ నీలావతి చేతుల మీదుగా శుక్రవారం పశుగణాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్లు నాగాంజనేయులు, వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మండలంలోని ప్రారంభం అయిన పశు గణణ.

సోమల: మండలంలోని అన్ని పంచాయతీలలో ప్రభుత్వ ఆదేశానుసారం పశు గణన శుక్రవారం నుండి ప్రారంభం అయినట్లు పశు వైద్యాధికారిని చందన ప్రియ తెలిపారు. జనాభా గణన విధంగానే పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపుడు కుక్కలు మండలంలో ఎన్ని ఉన్నాయి అన్న వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపడం జరుగుతుందన్నారు.

దళితవాడలో దాహపు ఎక్కిళ్లు!


చేతి పంపు


మరమ్మతులకు గురైన త్రాగునీరు బోరు

- ఆరు నెలలుగా ఇదే పరిస్థితి
- తాగునీటి కోసం తప్పని ఇబ్బందులు
- అధికారులకు చెప్పినా పట్టించుకోలేదన్న స్థానికులు

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని కోసల నగరం దళితవాడలో ప్రజలు తాగునీటి కోసం ఆరు నెలలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామంలో సుమారు 15కుటుంబాలు జీవిస్తున్నారు. గ్రామానికి ఉన్న బోరు మోటారు మరమ్మతులకు గురై ఆరు నెలలు గడిచినా ఇప్పటి వరకు అధికారులు పట్టించుకోలేదని ఆ గ్రామస్తులు చెబుతున్నారు. అనేక మార్లు అధికారులకు సమస్యను వివరించినా ఏమాత్రం అటువైపు చూడలేదని, ఇటీవల నిర్వహించిన గ్రామ సభలోనూ తాగునీటి బోరు మరమ్మతులు చేపట్టాలని వినతిపత్రం ఇచ్చినా లాభం లేకపోయిందంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని, బోరు మోటారుకి మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

చేతి పంపే దిక్కైంది..

ఆరు నెలలుగా గ్రామంలో నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న తమకు చేతి పంపే దిక్కైందని ఆ కాలనీ వాసులంటున్నారు. అయితే చేతి పంపు తుప్పు పట్టి ఉండడంతో ఆ నీటిని తాగడానికి అవకాశం లేకుండా పోయిందని, కోసలనగరంలోని మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి నీళ్ల తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఇప్పటికైనా


వాడకంలో లేని ఫ్యూజ్ క్యారియర్

ఇబ్బందులను అర్థం చేసుకొని నీటి సమస్యకు పరిష్కారం చూపాలని మహిళలు కోరుకుంటున్నారు.

విద్యార్థులందరికీ డిజి లాకర్ నమోదు చేయాలి

- ఎంఈవో నాగేశ్వరరావు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: డిజి లాకర్‌ను ప్రతి విద్యార్థికీ నమోదు చేయాలని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం పివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో విద్యనభ్యసిస్తున్న ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉన్న విద్యార్థులకు ప్రత్యేకంగా ఆధార్‌ని నమోదు చేయాలని విద్యార్థి ఇంటి పేరుతో తల్లిదండ్రుల పేరు పుట్టిన తేదీ పూర్తిగా నమోద చేయాలని వాటిలో ఏవైనా చేర్పులు మార్పులు ఉంటే వాటిని సక్రమంగా చేపించి వాటిని డిజీ లాకర్ ద్వారా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో 2 రమేష్ బాబు, ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- సిహెచ్‌వో లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-యాదమరి: ప్రాణాంతకమైన జ్వరాల బారి నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోండి అని సీహెచ్‌వో లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం యాదమరి పీహెచ్‌సీ పరిధిలోని ఎర్రచేను గ్రామంలో ఫ్రైడే-డ్రైడేపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. సిహెచ్‌వో మాట్లాడుతూ వర్షాలు విస్తారంగా కురుస్తున్నదని దీంతో దోమలు వ్యాపించి ప్రాణాంతకమైన జ్వరాలు బారిన పడే అవకాశం ఉందన్నారు. నివాస గృహాలతో పాటు వాటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని దానివల్ల మంచి నీటిలో పెరిగే దోమలను, వాటి లార్వాలను నిర్మూలించవచ్చు అన్నారు. నివాస గృహాల పరిసరాల్లో ఎక్కడ వర్షపు నీరుగాని మురుగునీరు గాని నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని దోమతెరలు తప్పనిసరిగా వాడాలని వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి దివ్యశ్రీ, మహిళా ఆరోగ్య కార్యకర్త ప్రియకుమారి, ఆశా కార్యకర్తలు రమీల, భువనేశ్వరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు విశేష స్పందన

ప్రజాశక్తి-సదుం: అమ్మగారిపల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం సదుం మండల తహశీల్దార్ మారూఫ్ హుస్సేన్ రైతుల సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మగారిపల్లి రెవెన్యూ పరిధిలోని రెడ్డివారి పల్లి, గుండ్లూరువారిపల్లి, బందార్ల వారిపల్లి, కలకటవారిపల్లి, ఎగువ జాండ్రపేట, అమ్మగారిపల్లి గ్రామాలలోని రైతులు గ్రామసభలో విశేషంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రైతుల సమస్యలను అర్జీల రూపంలో తీసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీటీ కుమార్, వీఆర్వో మహబూబ్ బాషా, సర్వేయర్ పవన్ కుమార్, టీడీపీ నాయకులు జయకుమార్ రెడ్డి, గౌతమ్‌కుమార్ రెడ్డి, తిరుమలేష్, చంద్రయ్య, పాల రమణ, సిబ్బంది పాల్గొన్నారు.


31న ఏఐటియుసి వ్యవస్థాపక దినోత్సవం

- జయప్రదం చేయాలని నాయకుల పిలుపు

ప్రజాశక్తి-విజయపురం(నగిరి): నగిరి నియోజకవర్గం ఏఐటియుసి అనుబంధ కార్మిక సంఘాల నాయకుల సమావేశం నగరిలో శుక్రవారం ఎస్ షబ్బీర్ భాష అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఐటీయూసీ చిత్తూరు జిల్లా గౌరవ అధ్యక్షులు యస్.నాగరాజు ఏఐటియుసి 14వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈ నెల 31న నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నగిరి పట్టణ సిపిఐ కార్యదర్శి వి వేలన్, కార్యవర్గ సభ్యులు యస్ షబ్బీర్ బాషా, ఎన్ విజయ కుమార్, నాయకులు మురళి, హంస, నగోమి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు సామగ్రి వితరణ

ప్రజాశక్తి-పలమనేరు:



పలమనేరు రూరల్ మండలం ఐసిడిఎస్ సెక్టార్‌లోని 25 అంగన్వాడీ కేంద్రాలకు పట్టణానికి చెందిన సామాజిక సేవా దాత శ్రీపురం సీతారామయ్య, నాగమణి చారిటబుల్ ట్రస్ట్, రత్న బయో లైఫ్ సంయుక్తంగా సామగ్రిని వితరణగా ఇచ్చారు. 25 కేంద్రాలకు ప్రెజర్ కుక్కర్లు, 25వాటర్ క్యాన్‌లు, 25మ్యాట్లు దాత సీతారామయ్య కుటుంబ సభ్యులు ప్రవీణ్, శ్రీవల్లి, పద్మజ చేతుల మీదుగా అందిచారు.

రోడ్డు ఆక్రమిత దుకాణాల తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి-విజయపురం(నగరి): నగరి పట్టణంలో రోడ్డుకు పక్కన ఆక్రమణకు గురైన దుకాణాలను తొలగించాలని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ కెవి కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం తమ సిబ్బందితో కలసి ప్రధాన వీధుల్లో, టవర్ క్లాక్ సెంటర్ వద్ద పర్యటించారు. రోడ్డు మార్జిన్లను అదిగమించి ఆక్రమి ంచిన దుకాణదారులను హెచ్చరించారు. స్వతహా గా తొలగించకుంటే తామే స్వయంగా తొలగి స్తామని చెప్పారు. దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించాలని సూచించారు. భవిష్యత్‌లో మరోసారి


దుకాణదారులను హెచ్చరిస్తున్న కమిషనర్

ఆక్రమించకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని కమిషనర్ ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారులు విఎల్ఎన్ మూర్తి, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-విజయపురం(నగరి): అండర్ 17 బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో నగిరి మండలం నాగరాజు కుప్పం ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పదవ తరగతి చదువుతున్న మమత, నీరజ పిసిఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్ 17 బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. విరు త్వరలో రాజమండ్రి, కొవ్వూరులో జరిగే పోటీలలో పాల్గొంటారు. అదేవిధంగా ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ పాఠశాల పుత్తూరులో జరిగిన అండర్ 14 కబడ్డీ పోటీలలో జ్యోషా 9వ తరగతి విద్యార్థి మంచి ప్రతిభ కనబరిచి త్వరలో నంద్యాలలో బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయిలో పాల్గొంటుందని పాఠశాల హెచ్ఎం మునిరత్నం, పాఠశాల పీడీ చెన్నకేశవరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయులు రవిశేఖర్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

కబడ్డీ పోటీలకు సదుం విద్యార్థులు..

ప్రజాశక్తి-సదుం: నవంబర్ 8, 10, 11, 24వ తేదీలలో బాపట్ల జిల్లా, పిట్టలవానిపాలెంలో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సదుం జెడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు ధరణిధర్, జాహ్నవి, గుణశేఖర్ ఎనిమిదో తరగతి విద్యార్థి ఎంపికైనట్లు శుక్రవారం పాఠశాల హెచ్ఎం వై జయకుమార్ రెడ్డి తెలిపారు. విద్యార్థులకు, శిక్షణ ఇచ్చిన పీడీలను, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో గత ఇన్‌ఛార్జ్ హెచ్ఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కులాన్ని గుర్తించండి.. ధ్రువీకరణ పత్రాన్ని అందించండి'

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం పట్టణంలో పసుంపొన్ను ముత్తురామలింగం దేవర్ జయంతి వేడుకలను దేవర్ సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షులు శివ దేవర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధులుగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం హాజరయ్యారు. అంబికా విశ్వనాథ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్ద ముందుగా పసుంపొన్ను ముత్తురామలింగం దేవర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు, కుల సభ్యులు మాట్లాడుతూ పసుంపొన్ను ముత్తురామలింగం దేవర్ సమాజ శ్రేయస్సుకు చేసిన సేవా కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు ముందే దేవర్ కులస్తులు తమ కులాన్ని గుర్తించి, కుల ధ్రువీకరణ


సభలో పాల్గొన్న నాయకులు, కుల సభ్యులు

పత్రాలను అందించాలంటూ తమ దృష్టికి తీసుకువచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డాక్టర్ వెంకటేష్, రాజ్ కుమార్, సోము, సురేష్, కుల సంఘం సభ్యులు ఈశ్వర్ దేవర్, పాండియన్, మురుగన్, ప్రకేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యుదయమే చంద్రబాబు లక్ష్యం

- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలో వెలుగు కార్యాలయంలో మండల సమైక్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్

చైర్మన్ ఆర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యుదయమే సీఎం చంద్రబాబు లక్ష్యమని.. రాష్ట్రంలో ప్రగతి పథంలో మహిళలు నడుస్తున్నారంటే దానికి ముఖ్య కారణం చంద్రబాబే అన్నారు. గతంలో వెలుగు గ్రూపులను ఏర్పాటు చేసి మహిళలు తమ కాళ్ళ మీద నిలబడేలా చేసిన నాయకుడని.. అలాంటి నాయకుడు అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళుతున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బాబు నాయుడు, మాజీ ఎంపీపీ మునిరాజు, మాజీ జెడ్పిటిసి బెటప్ప నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ హిమాంబర్ గౌడ్, నాయకులు గోవిందస్వామి, సుబ్రమణి, వెంకటేష్, రామచంద్రుడు, భాను తదితరులు పాల్గొన్నారు.

మూడు వాహనాలు ఢీ

- ఆటో డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మూడు వాహనాలు ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలోని మొగిలి ఘాట్లో చోటు చేసుకుంది. ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ, రోడ్డు రవాణా శాఖ ఇరువురు వేగ నియంత్రణ కోసం దాదాపు 5కిలోమీటర్ల మేరా ప్రమాదాల నివారించేందుకు సూచిక బోర్డులు, ఎస్ టైప్, సిగ్నల్ లైట్స్, ఏర్పాటు చేశారు. కానీ వాహనదారులకు అవి ఏవి పట్టించుకోకుండా అతివేగంగా రావడం వలన దగ్గరికి వచ్చినప్పుడు వాటిని గమనించి బ్రేకులు వేయడం వలన వెనక వస్తున్న వాహనాలు ఒకటి మరొకటి ఢీకొంటున్నాయి. దీని వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై శాశ్వత పరిష్కారం ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. శుక్రవారం కారు, ఆటో, లారీ ఒకటి వెనుకల ఒకటి ఢీకొన్నాయి.



జూదరుల అరెస్ట్

- రూ.2లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి-పుంగనూరు: గ్యాంబ్లింగ్ ఆడుతున్న 6మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రెండు లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు శుక్రవారం రాత్రి పోలీసులు తెలిపారు. సుగాలి మిట్ట అటవీ ప్రాంతంలో ఎనిమిది మంది కలిసి పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు చేసి ఆరు మందిని అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారీ కావడం జరిగింది. వారి వద్ద నుంచి 2 లక్షల 42వేలు రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. 6 మందిపై కేసు నమోదు చేశారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ బోల్తా

- ఒకరు మృతి


ట్రాక్టర్ కింద కార్తీక్ మృతదేహం

ప్రజాశక్తి- గుడిపాల: ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందిన ఘటన శుక్రవారం మండ లంలోని పసుమంద ఎస్టీ కాలనీలో చోటు చేసుకుంది. గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ కథనం మేరకు.. మండలంలోని పసుమంద ఎస్టీ కాలనీలో తమిళ నాడు రాష్ట్రం, సేర్కాడు కూట్ రోడ్‌కు చెందిన కార్తీక్ తన అత్తగారి ఇంటి వద్దనే ఉండి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఎప్పటిలానే ట్రాక్టర్ నడుపుతుండగా మధ్యాహ్నం సుమారు 2గంటల సమయంలో ట్రాక్టర్ అదుపుతప్పి తన పై పడడంతో కార్తీక్ అక్కడికక్కడే మృతి చెం దాడు. కుటుంబ యజమాని మృతి చెందడంతో విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘ టన స్థలానికి చేరుకున్నారు. ట్రాక్టర్ కింద పడి ఉన్న కార్తీక్‌ని చూసి బోరున విలపించారు. ఇతని కి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో దొంగలు అరెస్ట్

- 6 ఆటోలు స్వాధీనం


నిందితులను అరెస్ట్ చూపుతున్న సీఐ

ప్రజాశక్తి-వి కోట: మండల పరిధిలో ఆటో దొంగతనాలకు పాల్పడిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 6ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సోమశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వి కోట మండలంలో గత కొన్ని రోజులుగా ఆటోలు దొంగతనానికి గురైతున్నాయన్న ఫిర్యాదులు రావడంతో కేసులు దర్యాప్తు చేపట్టామన్నారు. ఎస్ఐ బాబు, క్రైం పార్టీ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపినట్లు చెప్పారు. సిసి టీవీ ఫుటేజీ ఆధారంగా ఆటో దొంగలను గుర్తించినట్లు వివరించారు. గురువారం మండలంలోని కనుమనాయనపల్లి గ్రామ సమీపంలో హంద్రీ నీవా కాలువ వద్ద, అన్నవరం – రామకుప్పం రోడ్డు పక్కన అనుమానాస్పదంగా సంచరిస్తున్న వి కోటకు చెందిన మున్నవీర్(19), ఎస్ సల్మాన్(22), జబీ(31), రహమాన్ ఏ సుభాన్(25)లు గుర్తించామన్నారు. వీరు నలుగురూ జల్సాలకు అలవాటు పడి వి కోట పట్టణం, శివుని కుప్పం, కర్ణాటక రాష్ట్రం, ఎన్‌జి హుల్కూరు వద్ద మొత్తం 06 ఆటోలను దొంగతనం చేసినట్లు విచారణలో తేలిందన్నారు. వీటిని తమిళనాడు రాష్ట్రంలో తక్కువ ధరకు విక్రయించారని చెప్పగా, వీళ్ళ సహాయంతో తమిళనాడు రాష్ట్రం, తిరుపత్తూరుకు వెళ్లి అరుణ్ కుమార్ వద్ద ఉన్న 04ఆటోలను స్వాధీన చేసుకొని, నిందితుల వద్ద మరో రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వీటి విలువ సుమారు రూ.10లక్షల ఉంటుందన్నారు. నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నాటు సారా విక్రేత..

ప్రజాశక్తి-విజయపురం(నగరి): రహస్యంగా నాటు సారా తయారుచేసి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు నగరి సీఐ మహేశ్వర్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులకు వివరాలను వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు తమ పోలీసు సిబ్బంది శుక్రవారం ఉదయం సత్రవాడ చెరువు ప్రాంతంలో దాడులు నిర్వహించార్నారు. సారా తయారుచేస్తున్న సత్రవాడకు చెందిన కరివర్ధన్‌ను అరెస్ట్ చేశామన్నారు. 200లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు వివరించారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నాటు సారా తయారీ, విక్రయాలపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

వేర్వేరు కేసుల్లో ఆరుగురు నిందితులు..

ప్రజాశక్తి-విజయపురం(నగరి): రెండు రోజుల ముందు తడుకు పేటలో ఓ ఇంట్లోకి అర్ధరాత్రి ప్రవేశించి రెండు సెల్‌ఫోన్లు దొంగతనం చేసిన వారిని అరెస్ట్ చేసినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. శుక్రవారం వేర్వేరు కేసుల్లో నిందితుల అరెస్ట్‌కు సంబంధించిన వివరాలను విలేకరులకు తెలిపారు. తమిళనాడుకు చెందిన ముగ్గురు వ్యక్తులు వెట్రోవెల్ అనబడే వేలు(21), బాలచందర్ (21), విజయ్ కుమార్ (24)లను తమిళనాడు సరిహద్దులో పొన్పాడి చెక్‌పోస్టు వద్ద అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు రికవరీ చేసినట్లు చెప్పారు. వారికి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. అదేవిధంగా ఈనెల 1వ తేదీ తడుకు పేట జగనన్న కాలనీ వద్ద రాబరీ చేసి రూ.2000 దోచుకెళ్లిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు వివరించారు. అజిత్ (21), హుసేన్ (23) రోహిత్ (22)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.